క్లుప్తంగా

నేడు చొల్లంగిపేటలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'


మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

దెంకాడ: మండలంలోని చొల్లంగిపేటలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు చొల్లంగిపేటలో కార్యక్రమం ఉంటుందని, అనంతరం డి.కొల్లాం, గుణుపూరుపేట, గుణుపూరు, దెంకాడ, సింగవరం, నాతవలస గ్రామాల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాలువల శుభ్రతకు చర్యలు


మురుగు కాలువను పరిశీలిస్తున్న ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి

విజయనగరం: నగరంలోని అన్ని కాలువల్లో పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నట్లు ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి సూచించారు. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరదనీటి ప్రవాహం ద్వారా మురుగు కాలువల్లోకి చేరిన పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలను ఆయన సోమవారం పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన కాలువల్లోని వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే జేసీబీలతో చెత్తాచెదారం తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. మార్కెట్ వద్ద కాలువల్లో కుళ్లిపోయిన కూరగాయలు, పండ్లు వేయవద్దన్నారు.

నియామక పత్రం అందజేత


నియామకపత్రం అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందగా ఆయన కొడుకు పి.బాలాజీని హోంగార్డుగా నియమిస్తూ ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నియామక పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన బాలాజీకి నియామక పత్రం అందజేసి, ఎస్పీ పలు సూచనలు చేశారు. కొన్నిరోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణానంతరం విధుల్లో జాయిన్ కావాల్సి ఉంటుందన్నారు. బాగా పని చేసుకుని కుటుంబానికి అండగా నిలవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌చార్జ్ రిజర్వు ఇన్‌స్పెక్టరు ఆర్.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి..


రక్తదానం చేస్తున్న మహిళలు

గంట్యాడ: ఆరోగ్యంగా ఉన్నవారు ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చని.. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని మురపాక సర్పంచ్ ఈదుబిల్లి రమేష్ అన్నారు. మండలంలోని మురపాకలో అవయవ దాత గండి పల్లవి జయంతి సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరం, నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బెహరా రమ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సునంద, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ట్రాక్టర్‌ను పట్టుకున్న అధికారులు

గజపతినగరం: మండలంలోని పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ బి. రత్నకుమర్ తెలిపారు. మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన ఇజ్జిరోతు గోవింద, ఎం.గుమడాం గ్రామానికి చెందిన ఆవాల రాము, పట్నాన తవుడులకు చెందిన ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. అనుమతుల్లేకుండా ఎవ్వరు ఇసుక తరలించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె. అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి మెడలు వంచైనా.. హామీలు అమలు చేయిస్తాం!

- కొండవెలగాడలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'కి విశేష స్పందన
- కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండకు అడుగడుగునా ఆదరణ
- పూలు, హారతులతో ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు
- కూటమి మోసానికి బలై పోయామని గోడు వెల్లబోసుకున్న జనం


కొండవెలగాడ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వం మెడలు వంచైనా వారిచ్చిన హామీలు అమలు చేయించే బాధ్యతను వైఎస్సార్ సీపీ తీసుకుందని, ఆ దిశగా తామంతా పనిచేస్తున్నామని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాన్ని ఎండగట్టడమే లక్ష్యంగా ఊరూరా బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పేరిట చేపడుతున్న రచ్చబండ సమావేశాలకు విశేష స్పందన లభిస్తోంది. నెల్లిమర్ల మండలం, కొండవెలగాడ గ్రామంలో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండకు ఘనస్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించే క్రమంలో ప్రతి ఇంటి మహిళ ఆయనకు హారతులిచ్చి సాదరస్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పలువురు మాజీ ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపించి తమ అభిమాన నాయకుడిపై ఉన్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు. అక్కడి నుంచి బూరాడపేట, పెదబూరాడపేట, పారసాం గ్రామాలకు వెళ్లినా ప్రజల నుంచి ఇదే ఆదరణ కనిపించింది. 30 కార్లలో నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కార్యక్రమానికి హాజరై, ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను పార్టీ బలాన్ని చాటిచెప్పారు. ఇదిలా ఉంటే ఆయా గ్రామాల్లో జరిగిన రచ్చబండ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొని, కూటమి మోసపూరిత పాలన సహా స్థానిక ఎమ్మెల్యే నాగ మాధవి అబద్ధపు హామీలపై విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో కేవలం ఓట్లు దండుకోవడమే లక్ష్యంగా కూటమి నాయకులు అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టారని, తీరా గెలిచాక వాటి అమలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వారు ఇంతవరకు అమలు చేశామని చెబుతున్న ఒకట్రెండు పథకాలు కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. అర్హులందరికీ వారు పథకాలు అందివ్వడం లేదని, వారి నాయకులు, కార్యకర్తలను పోషించడమే పరమావధిగా అటు పథకాలు గానీ ఇటు కాంట్రాక్ట్‌లు గానీ ఇస్తున్నారని విమర్శించారు.


కూటమి మోసాలను వివరిస్తూ బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ బ్రోచర్ల ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, పార్టీ నాయకులు, కార్యకర్తలు

అసత్య ఆరోపణలు తగవు..

ఇక్కడి ఎమ్మెల్యే లోకం నాగమాధవి..నియోజకవర్గాన్ని అమెరికాలా చేస్తానని, నిరుద్యోగులందరికీ పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలిప్పిస్తానన్నారని తీరా చూస్తే ఆమె ఆచూకీ కనిపించడం లేదన్నారు. ఎప్పుడెప్పుడా ఉద్యోగాలిస్తారని నిరుద్యోగ యువతీ యువకులంతా ఎదురుచూస్తున్నారని వారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. దళితులను కించపరిచాననే అసత్య ఆరోపణలతో తనపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి దంపతులు నాలుగు మండలాల పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేయించడం సిగ్గుచేటన్నారు. తనకు దళితులంటే ఎనలేని ప్రేమ అని, వారిని తానెలా కించపరుస్తానన్నారు. ఇటువంటి నీచమైన రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. అటు రాష్ట్రంలో ఇటు నియోజకవర్గంలో పాలన పూర్తిగా భ్రష్టు పట్టిందన్నారు. తామంటే అభివృద్ధి అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆయన చేసిన అభివృద్ధి జాడలు గ్రామాల్లో మచ్చుకైనా కనిపించడం లేదన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయన్నారు. కూటమి అక్రమాలకు బలవుతున్న అమాయక జనం వైపు వైఎస్సార్ సీపీ పోరాడుతుంటే అక్రమ కేసులు బనాయించి నేతలను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. కుట్రపూరిత రాజకీయాలు, హత్యలు, అత్యాచారాలు, భౌతికదాడులతో రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారని దుయ్యబట్టారు.

ప్రశ్నిస్తానన్న మనిషెక్కడ?

ఎక్కడైనా ఎవరైనా అణచివేతకు గురైనా, మోసపోయినా ప్రశ్నిస్తానన్న పవన్‌కల్యాణ్.. ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఒకింత ఆయన బట్టే కూటమిని నమ్మి అధికారంలోకి తెచ్చుకున్నామని అనుకుంటున్న జనానికి ఆయన ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. ప్రతి గ్రామానికి వెళ్తుంటే తమకు లభిస్తున్న ఆదరణ చూసి గర్వంగా ఉందని, ఇదంతా గతంలో తమ ప్రభుత్వం(వైఎస్సార్ సీపీ) చేసిన మేలే కదా అని అనిపిస్తోందన్నారు. అప్పట్లో జగనన్న చేసిన మంచియే ఇప్పుడు తమను నిర్భయంగా జనంలో తిరిగే ధైర్యమిచ్చిందన్నారు. ఇప్పటికే గత వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు తేడాలు చెప్పుకునే పరిస్థితి నెలకొందన్నారు. ప్రతిఒక్కరిలో ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని, రాబోయే రోజుల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. మరోసారి జగనన్న సీఎం అవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సీనియర్ నాయకులు మత్స సత్యనారాయణ, సముద్రపు రామారావు, దంతులూరి గిరిబాబు, రేగాన శ్రీనివాసరావు, గేదెల రామచిరంజీవి, తర్లాడ దుర్గారావు, మొయిద అక్కోజీ, సంగంరెడ్డి జగన్నాథం, బెల్లాన రామారావు, మక్కువ వెంకటరమణ, శంకరరావు, సాంబ, కోట్ల పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య


ప్రజాసమస్యలు వింటున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి నాలుగు వినతులు వచ్చాయి. వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి, 3..ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి మరో వినతి ఉన్నాయి. ఈ వినతిపత్రాలను స్వీకరించి, పరిశీలించిన కమిషనర్..ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అధికారుల దృష్టికి వస్తున్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కాలువలను ఆక్రమించి కొంతమంది నిర్మాణాలు చేపడుతున్నారని వాటి వల్ల కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతోందన్నారు. కాలువలపై ఎటువంటి నిర్మాణాలు చేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బంగారు కుటుంబాల గుర్తింపు


మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: మార్గదర్శి-బంగారు కుటుంబాలు గుర్తించేందుకు మంగళవారం నుంచి వార్డు సభలు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఇదే విషయమై ఆయన నగరంలోని తన కార్యాలయంలో సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సోమవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా ప్రభుత్వం పీ4(పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) విధానం తీసుకువచ్చిందని, దీని ద్వారా నిరుపేద కుటుంబాలను ధనవంతులకు దత్తత ఇచ్చి వారిని(నిరుపేద కుటుంబాలు) బంగారు కుటుంబాలుగా మలచడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి నగరంలో ఇప్పటికే 6,776 కుటుంబాలను గుర్తించామని, ఈ కుటుంబాలను మరోసారి పునఃపరిశీలించి అసలైన జాబితా ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ నాటికి బంగారు కుటుంబాలుగా మలచాల్సిన జాబితా ఇస్తే వారిని మార్గదర్శకులను అప్పగించే బాధ్యత తీసుకోవడం జరుగుతుందన్నారు. మార్గదర్శి-బంగారు కుటుంబం పథకం ద్వారా పీ4 విధానం కింద పేదల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతున్న తీరును ప్రజలకు వివరించాలన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం


నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనంద్

పూసపాటిరేగ: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, తద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనంద్ తెలిపారు. మండలంలోని గోవిందపురంలో నవధాన్యాల సాగుపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలు పొలాల్లో జల్లుకోవాలని, 45 రోజుల తర్వాత మొక్కలైన తర్వాత అదే నేలలో వాటిని దున్నుకోవాలన్నారు. ఇలా చేయడం ద్వారా భూసారం పెరిగి పంటకు కావాల్సిన పోషకాలు, ఖనిజ లవణాలు పుష్కలంగా అందుతాయన్నారు. ఎకరా పొలంలో 25 కిలోల నవధాన్యాలు వేసుకుంటే చాలన్నారు. కొబ్బరి సాగులో అంతర పంటలు పండించడం ద్వారా అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఎల్ ప్రకాష్, ఎంటీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



ఔట్‌గేటును అల్లేసిన తీగమొక్కలు


కార్యాలయం బయట చెత్తాచెదారం


ప్రహరీ వద్ద ఇలా..

విజయనగరం జిల్లా కలెక్టరు కార్యాలయం ప్రహరీ, ప్రధాన గేటులపై ఇలా తీగమొక్కలు అల్లుకుని అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. దీనికి తోడు కార్యాలయ పరిసరాల్లో అపరిశుభ్రత విపరీతంగా పేరుకుపోయింది. జిల్లా అధికారులు ఉన్న చోటే ఇలా ఉంటే..ఇక సామాన్య జనం నివశించే చోట ఇంకెంతలా పారిశుద్ధ్య లోపం ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని పలువురు అంటున్నారు. ఓ వైపు చెత్తాచెదారంతో కార్యాలయ పరిసరాలు నిండిపోగా మరోవైపు అవుట్ గేటు, బోర్డు, సీసీ కెమెరా, సింహతలాటం కనిపించనంతగా పిచ్చి మొక్కలు పెరుగుతుంటే ఏం చేస్తున్నారని కార్యాలయానికి వస్తున్న వారు ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

బీఎస్‌ఎన్‌ఎల్ ఆస్తులను పరిరక్షించాలి

- బీఎస్‌ఎన్‌ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు


బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ బ్యాటరీ బాక్స్‌ను ధ్వంసం చేసిన దృశ్యం

విజయనగరం టౌన్: బీఎస్‌ఎన్‌ఎల్ ఆస్తులు చోరీకి గురవుతున్నాయని, వాటిని పరిరక్షించుకోవాలని ఆ శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు అన్నారు. ఇదే విషయమై ఆయన స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఆవరణలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తెర్లాం మండలం, పెరుమాళి గ్రామంలో రాజాం వెళ్లే రోడ్డు పక్కన బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ బ్యాటరీ బ్యాంక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి పట్టుకుపోయారని, అందులోని బ్యాటరీల విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందన్నారు. దీనిపై తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. గతంలో పార్వతీపురం మన్యం జిల్లా, రాయివలస గ్రామంలో కూడా ఇలాంటి చోరీ ఘటనే చోటుచేసుకుందని, అయితే ఆ ఘటన నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించినా వారు సరిగా స్పందించకపోవడం విచారకరమన్నారు. 2020 ఆగస్టులో పోలీస్ బ్యారెక్స్‌ను ఆనుకుని ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సంబంధిత కంప్యూటర్స్, బయోమెట్రిక్స్, ప్రింటర్స్, స్కానర్లను కూడా దొంగలు పట్టుకుపోయారని, దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు నాట్ ట్రేస్డ్ సర్టిఫికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించాలని ఎస్పీకి కూడా విన్నవించామన్నారు. పోలీసులు కూడా బీఎస్‌ఎన్‌ఎల్ ఆస్తుల దొంగతనాల కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థికసాయం

దెంకాడ: జామి మండలంలోని కుమరాం గ్రామంలో ఉన్న అట్టాడ బీఎన్‌ఆర్ ఆశ్రమంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు జేడీ ఫౌండేషన్ ఆర్థికసాయం చేసింది. ఆశ్రమ భద్రతకు ఉపయోగపడేలా సీసీ కెమెరాలు కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలని రూ.10 వేలను ఆశ్రమ నిర్వాహకులకు ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం అందజేశారు.

నేడు గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

విజయనగరం అర్బన్:

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి విజయనగరం జిల్లా గురుకులాల కో-ఆర్డినేటర్ ఎస్.రూపావతి సోమవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్న అన్ని మిగులు సీట్లను భర్తీ చేస్తామని, దీనికోసం పూసపాటిరేగ మండలంలోని కొప్పెర్ల గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హత పత్రాలతో హాజరుకావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు8985883015, 6303838657ను సంప్రదించాలని కోరారు.

కలుషితమైన నీరు తాగలేకపోతున్నాం..


జేసీని కలిసిన పిడిశీల గ్రామస్తులు

విజయనగరం అర్బన్: గజపతినగరం మండలం, పిడిశీల గ్రామంలో తాగునీరు కలుషితమైపోతోందని, ఆ నీరు ఎలా తాగాలంటే భయమేస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదే విషయమై వారు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వెళ్లి, జేసీ సేతుమాధవ్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. గ్రామం చుట్టూ ఉన్న చేపల చెరువుల నిర్వహణలో లోపాల కారణంగా తాగునీరు కలుషితమైపోతోందని, ఆ నీరు తాగుతుండడం వల్ల పక్షవాతం, కేన్సర్, గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయన్నారు. ఇదే విషయమై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేస్తే నీటి స్వచ్ఛత పరీక్షలు చేయడం, నివేదిక ఇవ్వడం కూడా జరిగిందన్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. స్పందించిన జేసీ.. చేపల చెరువుల నిర్వహణపై నివేదిక ఇవ్వాలని మత్స్య శాఖ జిల్లా అధికారి నిర్మలాకుమారిని ఆదేశించారు. జేసీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ పోలిపిల్లి అప్పలనాయుడు, సుంకరి పైడిపినాయుడు, వైస్ ప్రెసిడెంట్ కర్రోతు గురుమూర్తి తదితరులు ఉన్నారు.

గరివిడికి పూర్వ వైభవం తీసుకువస్తాం..


విశ్వభారత్ సేవాట్రస్ట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని రీ యూనియన్ ఆఫ్ గరివిడి సంఘ ప్రతినిధులు స్పష్టం చేశారు. గరివిడిలో గతంలో మాదిరిగా సేవా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక శ్రీరామ్ హైస్కూల్ ఆవరణలో విశాఖపట్నం విశ్వభారత్ సేవాట్రస్ట్ సహాయ, సహకారాలతో రీ యూనియన్ ఆఫ్ గరివిడి సంఘ ప్రతినిధులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. గరివిడికే తలమానికంగా ఉన్న అనేక నిర్మాణాలు నేలమట్టమయ్యాయని, విలువైన స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. ప్రజలు వాకింగ్, రన్నింగ్‌కు గ్రౌండ్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వినాయక ఉత్సవాల కోసం ఫేకర్ యాజమాన్యం విడిచిపెట్టిన స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆయా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందించాలని విశ్వభారత్ సేవాట్రస్ట్ చైర్మన్ బలివాడ రమేష్‌ను కోరారు. దీనికి రమేష్ స్పందిస్తూ... గ్రౌండ్, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు సహకరిస్తానని చెప్పారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. గరివిడిలో పుట్టిపెరిగి ఉన్నత స్థాయికి ఎదిగి సొంత ఊరిపై ఉన్న అభిమానంతో సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు వచ్చిన బలివాడ రమేష్ అభినందనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు కంబాల శివ, ఎం.జగన్నాథరాజు, కె.పాపారావు, జీఎవన్ రాజు, ఎం.వెంకటేశ్వరరావు, మాలీ, సయ్యద్ గఫార్, తదితరులు పాల్గొన్నారు.

ఫేకర్ పరిశ్రమ తెరిపించాలి


మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడిలో మూతపడిన ఫేకర్ పరిశ్రమను ప్రభుత్వం తెరిపించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు టీవీ రమణ కోరారు. ఫేకర్ పరిశ్రమ గేట్ ఎదురుగా సోమవారం జరిగిన కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఫేకర్ యాజమాన్యం 2023 నవంబర్‌లో 100 శాతం లేఆఫ్ ప్రకటించిందని, నేటి వరకు కూడా తెరవలేదన్నారు. గడిచిన 20 నెలలుగా లే ఆఫ్ వేతనాలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు స్పందించి పరిశ్రమ తెరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూలో చేరికలు.. గరివిడి ఫేకర్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తూ 2021 ఫిబ్రవరిలో పర్మినెంట్ అయిన 116 మంది కార్మికులు సీఐటీయూ సంఘంలో చేరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఎ.గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు, తదితరులు పాల్గొన్నారు.